RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శనివారం 05- 9- 2026 సంపుటి : 6 సంచిక : 210 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00



# ఢిల్లీలో కుండపోత వర్షం

- జలమయమైన విమానాశ్రయం
- విమాన సేవలకు తీవ్ర అంతరాయం
- రోజుకు1,300కు పైగా విమానాలు రాకపోకలు
- ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటిలో

## మంత్రి పదవి కోల్పోయిన అనంతరం

# కొండా చూపు.. గులాబీ వైపు!?




- కేసీఆర్ మంచివారంటూ సురేఖ ప్రశంస
- కొండా ఫ్యామిలీ బీఆర్ఎస్‌లోకి.. అని చర్చ గులాబీ ట్రబుల్
- షూటర్ ద్వారా సంప్రదింపులు జరుగుతున్నట్లు ప్రచారం
- కొండా దంపతులకు బీజేపీ ఆహ్వానం!
- పార్టీ మారడంపై కొండా తర్జనభర్జన
- సురేఖను బీఆర్ఎ?సలోకి రానివ్వం
- తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డినీ తీసుకోం
- మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు

వరంగల్/హైదరాబాద్/బంజారాహిల్స్, **అభ్యుదయం** మంత్రి పదవి కోల్పోయిన అనంతరం కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతుల రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర చర్చ మొదలైంది. మంత్రి పదవి పోయినా తాను కాంగట?స్రలోనే ఉంటానని, ఎమ్మెల్యేగా కొనసాగుతానని ప్రకటించిన సురేఖ.. కొన్ని గంటల్లోనే కేసీఆర్ మంచివారంటూ వ్యాఖ్యలు చేయడం ఆసక్తికరంగా మారింది. కొండా దంపతులు బీఆర్ఎ?సలో చేరుతారనే ఊహాగానాలు మొదలయ్యాయి. గులాబీ పార్టీ కీలక నేతలు ఇప్పటికే కొండా దంపతులతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు బీజేపీ కూడా కొండా దంపతులకు ఆహ్వానం పలుకుతున్నట్టు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఇప్పటికిప్పుడు పార్టీ మారాలా, వేచి చూడాలా అన్నదానిపై కొండా దంపతులు తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం.

**ఆ వ్యాఖ్యల వెనుక మర్మమేమిటి?**

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన తర్వాత ఓ మీడియా చానెల్‌లో మాట్లాడిన కొండా సురేఖ.. మాజీ సీఎం కేసీఆర్ చాలా మంచివారని, హుందాగా వ్యవహరిస్తారని.. తమను ఎప్పుడు ఒక్కమాట కూడా అనలేదని పేర్కొన్నారు. అంతేకాదు తాము అడిగిన వెంటనే కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. ఉన్నట్టుండి ఇలా సానుకూల వ్యాఖ్యలు చేయడం వెనుక మర్మమేమిటన్న చర్చ జరుగుతోంది. 2014లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ నుంచి కొండా సురేఖ బీఆర్ఎ?సలో చేరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ మంత్రి పదవి రాలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల బీఆర్ఎస్ అభ్యర్థుల రెండో జాబితాలోనూ తన పేరు ప్రకటించకపోవడంతో.. సురేఖ బీఆర్ఎస్‌ను వీడి

మిగతా 2లో

## రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి.

- మల్లికార్జున్ ఖర్గే ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాడుతోంది
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి, **అభ్యుదయం**
కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేరిపై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా

మిగతా 2లో



# భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది

- రాజకీయ ఒత్తిడికి గురయ్యే పరిస్థితి వచ్చింది
- బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ వ్యాఖ్యలు

2లో



# డాటా, ఏఐ రంగాలకు స్వర్ణయుగం

- ఐటీని టైర్-2, 3 సిటీలకు విస్తరించాలి : కేటీఆర్
- బీఆర్ఎస్ పాలనలో చిన్న పట్టణాల్లో ఐటీ హబ్‌లు
- స్మార్ట్‌ఫోన్లలో ప్రతి స్వైప్ వెనుక కంటెంట్ క్రియేషన్
- కాన్‌స్టర్ సొల్యూషన్స్ ఆఫీస్ ప్రారంభోత్సవంలో కేటీఆర్

2లో

# నియోజకవర్గంలో సీఎం రేవంత్‌కు మరో షాడో

- హకీంపేట ఇండస్ట్రియల్ పార్క్ సాక్షిగా పెరిగిన గ్యాప్
- పార్క్ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్
- కాంగ్రెస్ వర్గాల్లో రచ్చరచ్చ



మహబూబ్‌గర్, **అభ్యుదయం:** రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తర్వాత ఆ స్థాయిలో ఆయన కుటుంబంలో సోదరుడు తిరుపతిరెడ్డి ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. సీఎం ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి తిరుపతిరెడ్డినే షాడో ఎమ్మెల్యేగా చెప్పుకొంటారు. తాజాగా సీఎం రేవంత్ రెండు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనకు తిరుపతిరెడ్డి దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. హకీంపేట వద్ద నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కులో భారీగా అవినీతి జరిగిందని తిరుపతిరెడ్డి వర్గం కొన్ని రోజులుగా ఆరోపిస్తున్నది. ఈ విషయంలో నియోజకవర్గంలో సీఎం రేవంత్‌కు మరో షాడోగా ఎదిగిన లీడర్‌ను వెనుకేసుకొనిరావడం తిరుపతిరెడ్డికి నచ్చడం లేదట.సోదరుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి ఈ వివాదం వెళ్లిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా రేవంత్ పర్యటనలో తిరుపతిరెడ్డి కనిపించక పోవడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. తిరుపతిరెడ్డికి ఏకంగా క్యాబినెట్ మినిస్టర్స్‌కు

- మిగతా 2లో పేజిలో

# సోషల్ మీడియా పోస్టులతో మాకు సంబంధం లేదు



## సోషల్ మీడియా వేదికలపై కొండా సురేఖ ఆగ్రహం

హైదరాబాద్, అభ్యుదయం
): తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు.

మిగతా 2లో

అభ్యుదయం
The Pride of Telugu national daily

శనివారం 05-9-2026

# ఢిల్లీలో కుండపోత వర్షం

న్యూఢిల్లీ, సెప్టెంబర్4: దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి.

## తెలంగాణలో కొత్తగా చేయూత పింఛన్లు

**ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరణ**




హైదరాబాద్, సెప్టెంబర్4 తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తులకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు సమయంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు క్లారిటీ ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుల పరిశీలన సమయంలో మాత్రం కచ్చితంగా సమర్పించాలని సూచించారు. గీత కార్మికులకు ఆబ్కారీశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకున్నా ఆధార్, రేషన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చు.ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువీకరణ పత్రం కావాలి.. దివ్యాంగులకు సదరం, యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ ఏడీ ధ్రువీకరణ పత్రం ఉండాలి. దరఖాస్తు సమయంలో ఈ ధ్రువీకరణ పత్రం లేకపోయినా పర్లేదని.. పరిశీలన సమయంలో మాత్రం సమర్పించాలని సూచించారు. గతంలో పింఛన్లు వచ్చి, ఆ తర్వాత ఆయా కారణాలతో ఆగిపోయిన వారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. పరిశీలన సమయంలో మాత్రం ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తుల గడువును కూడా పొడిగించిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జులై 31తోనే గడువు ముగిసింది.. కానీ సెప్టెంబర్ 15 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేయని చాలామంది ఉన్నారు

.. వారి అభ్యర్థన మేరకు గడువు పొడిగించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా 2.50 లక్షల మందికి కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆగస్టు 9వ తేదీ నుంచి 5 కేటగిరిల్లో దరఖాస్తులు తీసుకుంటున్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఎంపిక ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు నిర్వహిస్తారు. రాష్ట్రంలో చేయూత పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆగస్టు 30 వరకు మొత్తం 4.34 లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

వీరిలో అత్యధికంగా 2.64 లక్షల మంది వితంతువుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం గడువు పెంచడంతో మరో 50వేలకుపైగా దరఖాస్తులు వస్తాయని అచంనా వేస్తున్నారు,

## రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి.

హాజరుకాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు.

కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీయుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రజల తరపున ప్రశ్నించడం రాహుల్ గాంధీ హక్కు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు.

# మంత్రి పదవి కోల్పోయిన అనంతరం కొండా చూపు.. గులాబీ వైపు!?

(మొదటి పేజీ (తరువాయి)

కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా కాంగ్రెస్‌లో ఇబ్బందికర పరిస్థితులతో.. కొండా దంపతుల చూపు గులాబీ వైపు మళ్లిందనే చర్చ మొదలైంది. బీఆర్ఎ?సలో ట్రబుల్ షూటర్‌గా పేరున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో కొండా దంపతులతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. కానీ మంత్రిగా ఉన్న సమయంలో కొండా సురేఖ కేటీఆర్‌పై అనేక ఆరోపణలు చేశారు. దానిపై కోర్టులో కేసులు కూడా నడుస్తున్నాయి. ఈ క్రమంలో సురేఖ బీఆర్ఎస్‌లోకి రావడాన్ని కేటీఆర్ స్వాగతిస్తారా? అనే సందేహం వ్యక్తమవుతోంది

### గ్రేటర్ వరంగల్, గ్రాడ్యుయేట్ ఎన్నికలపై ప్రభావమెంత?

త్వరలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ ఎన్నికలపై కొండా దంపతుల ప్రభావం ఎంతవరకు ఉంటుందనే కోణంలో ఆయా పార్టీలు అంచనాలు వేసుకుంటున్నాయి. గ్రేటర్ వరంగల్‌లో 66 డివిజన్లు ఉండగా.. అందులో 25 వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. అంతేకాదు గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో పోటీకి వీలుగా కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌లతో సంబంధం లేకుండా ప్రత్యేక టీమ్‌ను కొండా దంపతులు సిద్ధం చేసుకున్నారనే చర్చ ఉంది. ఇక తమ కుమార్తె కొండా సుస్మితను రాజకీయాల్లో క్రియాశీలకం చేయడానికి ఈ ఎన్నికలను వినియోగించుకోనున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కీలక నేతలతో కొండా దంపతులు చర్చలు జరిపినట్లు సమాచారం.



### కొండా మాజీ ఓఎస్డీ కేసులో ముగ్గురికి పోలీసు కస్టడీ

కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్, మరికొందరిపై నమోదైన హత్యాయత్నం కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు నిందితులు బత్తిని అరుణ్‌కుమార్, ముత్యాల మహేందర్‌రెడ్డి, పసుపులేటి కార్తిక్‌కుమార్‌లను పోలీసులు శుక్రవారం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకున్నారు. సుమంత్ ఆచూకీ, ఇతర వివరాలపై వారిని ప్రశ్నించారు.

### కొండా సురేఖకు భద్రత కుదింపు

కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో.. ఇప్పటి వరకు ఆమెకు మంత్రి హోదాలో ఇచ్చిన సౌకర్యాలను ప్రభుత్వం ఉపసంహరించుకుంటోంది. ఆమెకు ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని అధికారులు శుక్రవారం వెనక్కి తీసుకున్నారని.. హైదరాబాద్, హన్మకొండలోని ఆమె నివాసాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు రక్షణను తొలగించారని తెలిసింది. మంత్రి హోదాలో కేటాయించిన గన్‌మన్లను తగ్గించి, ఎమ్మెల్యే హోదాకు తగిన మేర కొనసాగిస్తున్నారని సమాచారం.

# సోషల్ మీడియా పోస్టులతో మాకు సంబంధం లేదు

"త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు.

గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు.

# నియోజకవర్గంలో సీఎం రేవంత్‌కు మరో షాడో

మించి భద్రత కల్పించి నియోజకవర్గం మొత్తాన్ని ఆయన చేతిలో పెట్టారు. ఏమైందో ఏమో కానీ కొంతకాలంగా కొడంగల్ నియోజకవర్గంలో తిరుపతిరెడ్డి బలాన్ని తగ్గించేందుకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యం లో లగచర్ల గొడవలకు కూడా కొంతమంది స్థానిక కాంగ్రెస్ నేతలే కారణమని.. ఆఫీసర్లపై రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారని భావిస్తున్నారు. కొంతమంది అధికారులు మరో షాడో గుప్పిట్లోకి వెళ్లి ఆయన ఏం చెబితే అది చేసే స్థాయికి వెళ్లడంతో దీనికి చెక్ పెట్టాలని తిరుపతిరెడ్డి వర్గం ప్రయత్నిస్తున్నది.

సీఎం పర్యటన.. సామాన్యులకు ఇక్కట్లునారాయణపేట జిల్లా మద్దూర్‌లో శుక్రవారం సీఎం రేవంత్ పర్యటనతో సామాన్యులకు ఇబ్బందులు తప్పలేదు. మద్దూరులో డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని అడిగి తెలుసుకొన్నారు. సీఎంగా రేవంత్‌ను గెలిపిస్తే తామంతా అభివృద్ధి చెందుతామనుకుంటే మా వ్యాపారసముదాయాలను మూసి వేయించారని కొందరు వ్యాపారులు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం సీఎం రేవంత్ మండలానికి వస్తున్నారంటే ఎంతో ఆనందపడ్డామని, కానీ మా దుకాణాలనే మూసి వేయించారని వాపోయారు. సీఎంకు బాధలు చెప్పుకొని వినతి పత్రాలు ఇవ్వాలని ఎదురు చూసిన వారికి కూడా నిరాశే మిగిలింది.

# డాటా, ఏఐ రంగాలకు స్వర్ణయుగం

హైదరాబాద్, సెప్టెంబర్ 4 డాటా, ఏఐ రంగాలకు స్వర్ణయుగం రాబోతున్నదని, టైర్-2, 3 నగరాల్లోని ప్రతిభావంతులైన యువత వీటిలో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ ప్రైమియా భవనంలో కాన్‌స్టర్ సొల్యూషన్స్ కంపెనీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు

. ఈ సందర్భంగా కంపెనీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కేటీఆర్‌కు వివరించారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్నదని, ముఖ్యంగా డాటా, డాటా సెంటర్లు, సర్వర్లు, కృత్రిమ మేధస్సు(ఏఐ), కంటెంట్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉజ్వల భవిష్యత్ ఉన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ రెండు రంగాల కోణాల నుంచి రెండు దశాబ్దాలుగా టెక్నాలజీ ప్రపంచాన్ని అత్యంత దగ్గరగా చూసిన అనుభవంతో చెబుతున్నానని వివరించారు. తాను కూడా రెండు దశాబ్దాల క్రితం కార్పొరేట్ ప్రపంచంలో పనిచేశానని, అమెరికాలో విద్యాభ్యాసం చేసి అక్కడ కొంతకాలం ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నదని కేటీఆర్ గుర్తుచేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ టైమ్‌జోన్లలో పనిచేస్తూ, అనేక దేశాల ఖాతాదారులతో కలిసి పనిచేయడం ఎంతటి సవాలో తనకు తెలుసని చెప్పారు.

# డీఎస్సీ పై కంప్యూటర్ క్రాస్ వెరిఫికేషన్‌కు ప్రభుత్వం సిద్ధమా?

తాడేపల్లి,కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025 ఒక 'మెగా డీఎస్సీ' కాదని, అది నిరుద్యోగుల గొంతు కోసిన 'దగా డీఎస్సీ' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నారా లోకేష్ తన 'యువగళం' కోటా కింద, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి అర్హత లేని తమ వారికి స్పోర్ట్స్ కోటా పేరుతో లక్షల రూపాయలకు టీచర్ ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపించారు. స్వయంగా ప్రజలే ఆధారాలతో సహా ఈ పాపాలను బట్టబయలు చేస్తున్నా, ప్రభుత్వం ఇంకా బుకాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ-2025లో ఎంపికైన అభ్యర్థుల టెట్ స్కోర్, కేటగిరీ, సబ్జెక్ట్ అర్హత, కేటాయించిన పోస్టును కంప్యూటర్ ఆధారంగా క్రాస్ వెరిఫికేషన్ చేయడానికి ప్రభుత్వం సిద్ధమా? అని నాని సూటిగా ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ నాయుడులకు నిజాలు బయటపెట్టే దమ్ముందా? స్పోర్ట్స్ కోటాలో సమర్పించిన సర్టిఫికెట్లను, ముఖ్యంగా జరగని ఈవెంట్లకు సంబంధించినవిగా ఆరోపణలు వస్తున్న సర్టిఫికెట్లను పూర్తిస్థాయిలో వెరిఫై చేయించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర థర్డ్ పార్టీ ఏజెన్సీ అయిన సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

కర్మ అనేది ఎవరినీ వదిలిపెట్టదు. అధికార బలంతో, అనుకూల మీడియా ప్రచారంతో ఎంత కాలం పాపాలను కప్పిపుచ్చగలరు? తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మా నాయకుడు జగన్ మోహన్ రెడ్డి తీగ లాగితే, రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ-2025 పాపాల డొంకంతా కదులుతోంది. నిన్నటిదాకా అసలు తప్పే జరగలేదన్న ఈ పాలకులు, ఇవాళ 16 వేల మందిలో ఒక్క తప్పు జరిగిందని తప్పించుకోవాలని చూస్తున్నారు. ప్రజలే శోధించి ఆధారాలతో సహా లోకేష్ బండారాన్ని బద్దలు కొడుతున్నారు.

టెట్ పాస్ కానివాడికి టీచర్ ఉద్యోగమా?

ప్రభుత్వ జీవో నం. 15 ప్రకారం టీచర్ ఉద్యోగం రావాలంటే టెట్ అర్హత తప్పనిసరి. ఏ కోటాలో వచ్చినా ఈ నిబంధన వర్తిస్తుంది.

### భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది

న్యూఢిల్లీ, సెప్టెంబర్4 చైనాపై ఎక్కువగా ఆధారపడిన యూరప్.. ఇప్పుడు దాని ప్రభావాలను ఎదుర్కొంటోందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. ఈ విషయంలో భారత్ మమ్మల్ని ఎప్పుడో హెచ్చరించిందని, అప్పట్లో తాము పట్టించుకోలేదని ఆయన అంగీకరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కి వచ్చిన బార్ట్ డి వెవర్.. ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. తక్కువ ధరలకే విదేశీ వస్తువులు యూరప్ మార్కెట్‌లోకి భారీగా రావడం వల్లే అక్కడి స్థానిక పరిశ్రమంలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గడిచిన కాలం యూరప్‌కు ఒక మేలకొలుపు. చాలా కాలంగా తక్కువ ధరలకు భారీగా వస్తువులు మా మార్కెట్‌లోకి వచ్చాయి. దాంతో మా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి పెరిగింది. చివరికి ఆ ఆధారపడటాన్నే రాజకీయ ఒత్తిడికి ఉపయోగించే పరిస్థితి వచ్చింది" అని డివెవర్ అన్నారు.

# ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

## లైసెన్స్ మినహాయింపు ఎత్తివేయాలి- కేంద్రానికి రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ లేఖ



విజయవాడ, సెప్టెంబర్ 4
ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు మద్యం ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. వాటి విక్రయాలపై నియంత్రణ అవసరమని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పీ. అరుణ్‌బాబు పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు ఇచ్చిన లైసెన్స్ మినహాయింపును ఇథనాల్ ఆధారిత శానిటైజర్లకు వర్తించకుండా ఉపసంహరించాలని కోరుతూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా)కు లేఖ రాశారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల సులభ లభ్యత కోసం కేంద్ర ప్రభుత్వం 27-07-2020న ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్ ద్వారా వాటి నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చిందని అరుణ్‌బాబు తెలిపారు. ప్రస్తుతం ఈ మినహాయింపును కొందరు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు.

విజయవాడ నగరంలో మద్యానికి బదులుగా ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు, దాడులు జరిపి కొన్ని రిటైల్ మెడికల్ షాపులు ఇథనాల్ ఆధారిత శానిటైజర్లను పెద్ద మొత్తంలో విక్రయించినట్లు గుర్తించామన్నారు. విజయవాడ పటమటలోని సాయి వెంకటేశ్వర ఫార్మసీ అండ్ సర్జికల్‌కు సంబంధించిన బిల్లులను స్వాధీనం చేసుకున్నామని, వాటి ప్రకారం ఏడాదిన్నర కాలంలో సుమారు 33,586 ఇథనాల్ 70 శాతం వీవీ (100 ఎంఎల్) సీసాలను కొనుగోలు చేసి విక్రయించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మూడు రిటైల్ విక్రయ కేంద్రాలపై లైసెన్స్ రద్దు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

కొవిడ్ సమయంలో ఇచ్చిన మినహాయింపు నాలుగేళ్ల తర్వాత కూడా కొనసాగుతుండటం వల్ల ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఇథనాల్ లేని ప్రత్యామ్నాయ హ్యాండ్ శానిటైజర్లు అందుబాటులో ఉన్నందున.. ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి ఇచ్చిన మినహాయింపును ఉపసంహరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పీ. అరుణ్‌బాబు కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్‌ను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఆలయ కమిటీ ఆహ్వానం



అమరావతి, సెప్టెంబర్ 4
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఆలయ కమిటీ ఆహ్వానం పలికింది. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఛైర్మన్ సురేంద్రబాబు సచివాలయంలో సీఎంను కలిసి ఈ నెల 14 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే ఈ ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు ఆలయ పండితులు వేదాశీర్వచనం పలికి స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.

# హ్యాపీ కృష్ణాష్టమి




శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా తెలుగు ప్రజలందరికి శుభాకాంక్షలు. అధర్మాన్ని అడ్డుకోవడానికి శ్రీ మహావిష్ణువు ఎత్తిన మరో అవతారం శ్రీకృష్ణావతారం. కురుక్షేత్ర మహా సంగ్రామంలో అర్జునుడికి కర్తవ్యబోధతో భగవద్గీతను అందించిన జగద్గురువు. మీకూ మీ కుటుంబానికి ఎల్లవేళలా శ్రీ కృష్ణుడి రక్ష ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను. శ్రీ కృష్ణ జన్మాష్టమిని వేడుకగా జరుపు కోవాలని ఆకాంక్షిస్తూ అందరికి శుభాకాంక్షలు.హ్యాపీ కృష్ణాష్టమి.

# నేపాల్ బాధితులకు అండంగా నిలిచిన సోనూసూద్



న్యూఢిల్లీ, సెప్టెంబర్4 ఇటీవల సంభవించిన తీవ్ర వరదలతో అల్లాడుతున్న నేపాల్ ప్రజలను ఆదుకునేందుకు ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూసూద్ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. బాధితులకు అవసరమైన దుప్పట్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సరుకులను భారత్ నుంచి తరలించి, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే, సోనూసూద్ నేపాల్ పర్యటనపై ప్రముఖ జర్నలిస్ట్ అజిత్ అంజుమ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. పనులు ఇంకా ప్రారంభం కాకముందే ఆయనను దేవుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకోవడం కేవలం 'సెల్ఫ్ మార్కెటింగ్' అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టడం కలకలం రేపింది. అయితే ఈ ప్రతికూల విమర్శలపై సోనూసూద్ ఎంతో హుందాగా, సానుకూలంగా స్పందించారు. "సోదరా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు రండి, మనమిద్దరం కలిసి ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం" అంటూ రీట్వీట్ చేశారు. ఎలాంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా, తనను విమర్శించిన వ్యక్తినే నేరుగా సేవా కార్యక్రమంలో భాగస్వామి కావాలని ఆహ్వానించిన ఆయన తీరు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సోనూసూద్ చూపించిన ఈ సంస్కారం, పరిణతిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, త్రిశూలి నది పరివాహక ప్రాంతాల్లో వరద విధ్వంసం తీవ్రంగా ఉందని, బాధితుల ఇళ్లను పునర్నిర్మించి వారు సాధారణ జీవితం గడిపే వరకు కొన్ని నెలల పాటు తమ 'సూద్ ఫౌండేషన్' తరఫున సహాయక చర్యలు కొనసాగుతాయని సోనూసూద్ స్పష్టం చేశారు. పరాయి దేశంలోనూ మానవత్వాన్ని చాటుకుంటూ ఆయన అందిస్తున్న సేవలకు గానూ అంతటా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

# రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని..

న్యూఢిల్లీ, సెప్టెంబర్4 ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని 'నా స్నేహితురాలు' అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా మోదీ స్పందిస్తూ.. "ఇటలీ యుద్ధానంతర చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న నా స్నేహితురాలు జార్జియా మెలోనీకి అభినందనలు. ఈ విజయం ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక" అని పేర్కొన్నారు. భారత్-ఇటలీ మధ్య 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' బలోపేతం కావడంలో మెలోనీ స్నేహం కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 2022 అక్టోబర్ 22న ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జార్జియా మెలోనీ, ఇవాళ్టికి 1,413 రోజులు పదవిలో పూర్తి చేసుకున్నారు. తద్వారా మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ రికార్డును ఆమె అధిగమించారు. గత జులైలో ప్రధాని మోదీ భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచినప్పుడు మెలోనీ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,సెప్టెంబర్3 తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. "కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

# కొండా సురేఖను తొలగించారు..

### పొంగులేటి సంగతి ఏమిటి?: బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్,సెప్టెంబర్3 తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు.

# డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం

### మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన




హైదరాబాద్,సెప్టెంబర్3 తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

# ముగ్గురు పిల్లలతో లోయలోకి దూకి రెజ్లర్ ఆత్మహత్య

మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో క్రీడా లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసేలా విషాద ఘటన చోటుచేసుకుంది. 'మహారాష్ట్ర టైగ్రెస్'గా పేరొందిన జాతీయ మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో కలిసి నల్‌దుర్గ్ కోటపై నుంచి 100 అడుగుల లోతైన లోయలోకి దూకింది. ఈ దారుణ ఘటనలో అశ్విని, ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా అక్కడికక్కడే మృతి చెందగా, కవల కుమార్తెలలో క్రాంతి ఆసుపత్రిలో కన్నుమూసింది. మరో చిన్నారి వీరా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై మృత్యువుతో పోరాడుతోంది. జాతీయ స్థాయిలో 5 స్వర్ణాలు, 6 రజత పతకాలు సాధించిన అశ్విని మృతిపై తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. భర్త, అత్తమామల శారీరక, మానసిక వేధింపుల వల్లే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందని అశ్విని తండ్రి ఫిర్యాదు చేయడంతో నల్‌దుర్గ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

అభ్యుదయం
The Pride of Telugu national daily
శనివారం 05-9-2026

# ఘనంగా కృష్ణాష్టమి.





గోవిందరావుపేట, సెప్టెంబర్ మండల పరిధి పసర రామాలయం ప్రాంగణంలో శుక్రవారం ఘనంగా శ్రీకృష్ణ అష్టమి వేడుకలు జరిగాయి, పురాణాల ప్రకారంపుట్టెడు కష్టాలతో చెరశాలలో జన్మించిన శ్రీ కృష్ణ పరమాత్ముడు తన చిలిపి చేష్టలతో వెన్న ముద్దల దొంగగా పెరిగి పెద్ద అయ్యే తరుణంలో పసి వయసులోనే తల్లి యశోదకు తన బుల్లి నోటిలో లోకాన్ని మొత్తం చూపించి దైవాంశ సంబుతుడయ్యాడని పురాణాలు చెబుతున్నాయి,కుటుంబ సభ్యుల మధ్య వైరం వచ్చాక మహా భారత యుద్ధ భూమిలో ధర్మం నెలకొని ఉన్న పంచ పాండవులవైపు అస్త్ర శస్త్రములు పట్టుకోకుండా తన తెలివితేటలతో కేవలం రధసారథిగా ఉంటూ పాండవులను గెలిపించి చరిత్ర సృష్టించి ప్రధాన భూమిక పోషించాడనేనేడు కలియుగానికి లోక పావనుడయ్యాడు, అంతటి గొప్ప మహానుభావుని ఆశీస్సులు మనపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి రోజుల శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకులను జరుపుకోవాలని నానుడి,

## ప్రమాదానికి చేరువలో విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు.



గోవిందరావుపేట, సెప్టెంబర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ అంగడి బజారు లొ వేసవికాలం నీళ్ల కోసం ఏర్పాటుచేసిన కాలుగ చెట్లు పెరిగి విద్యుత్ తీగలక అంటుకొని ప్రమాదగంటికలు మోగిస్తున్నప్పటికీ కూడా సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వార్డు ప్రజల ఆరోపిస్తున్నారు, అంగడి బజారు గ్రామపంచాయతీ బజారు కావడంతో అనునిత్యం వివిధ పనులపై గ్రామపంచాయతీకి వస్తూపోతూ ఉండడం జరుగుతుందని వారు తెలియజేశారు, అయినప్పటికీ విద్యుత్ తీగలు చెట్లకు తాగడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని విద్యుత్ తీగలకు చెట్లు తగలకుండా నిరోధించి ప్రాణాలను కాపాడవలసిందిగా గ్రామ ప్రజలు కోరుతున్నారు,

## బాబులును మదర్స రెసిడెన్షియల్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి-వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్**




వరంగల్ సెప్టెంబర్ 04 నగరంలోని దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాబులును మదర్స రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం నాడు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనిత వ్యాధులైన డెంగ్యూ మలేరియా చికెన్ గునియా వ్యాధుల నివారణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా చూసుకోవాలని దోమల కుట్టకుండా దోమతెరలు వాడాలని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ వైద్య ఆరోగ్య శిబిరంలో పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నెలు, ఏఎన్ఎం అమృత సుల్తానా , ఎమ్.ఎన్.ఓ. కాలువల కుమారస్వామి మదర్సా ఇన్చార్జ్ అబ్దుల్ అఖిఎం పాఠశాల విద్యార్థులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి రాని కెసిఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకు...?

**ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి...- ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్**



చిన్నకోదూరు సెప్టెంబర్ 4 నారదఅసెంబ్లీకి రాణి కెసిఆర్ కు ప్రతిపక్ష హోదా ఎందుకని ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ ఆరోపించారు.శుక్రవారం అల్లిపూర్ నుండి చిన్నకోదూరు వరకు కెసిఆర్ రాజీనామా చేయాలని బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నకోదూరు లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. కెసిఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలుపొంది వెయ్యి రోజులు గడిచిన అసెంబ్లీకి రాకపోవడం విడ్డురంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా పోషించకుండా 1 కోటి 24 లక్షలు తీసుకోవడం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయడమే అన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కెసిఆర్ రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ జిల్లా కన్వీనర్ రాజేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగరాల లక్ష్మి, భూపతి రెడ్డి, బత్తిని గణేష్, పరశు రాములు, చందు, బర్ల స్వామి, మహంకాళి యాదగిరి, రాజు, ఆర్టీసీ శీను, తిరుపతి, అశోక్,వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# 1000 రోజుల కాంగ్రెస్ దగా పాలనపై వంటావార్పుతో వినూత్న నిరసన










హన్మకొండ సెప్టెంబర్ 04
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసనగా వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలన ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైన దగా పాలనగా మారిందని విమర్శించారు.వృద్ధులు, వికలాంగులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, పేద కుటుంబాలు ఇలా అన్ని వర్గాల ప్రజలకు భారీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వృద్ధులకు రూ.4,000 పింఛన్, వికలాంగులకు రూ.6,000 పింఛన్, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఆ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు.వమహిళలు, గర్భిణీలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ వంటి కార్యక్రమాలను కొనసాగించకుండా నిలిపివేయడం పేద కుటుంబాలకు తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు అండగా నిలిచిన కల్యాణ లక్ష్మి పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయకుండా లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.
అలాగే విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని కూడా విస్మరించడం ద్వారా మహిళా విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టమవుతోందన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు"ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, అనేక హామీలు ఇచ్చి ప్రజల ఓట్లు అడిగిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో హామీని పక్కన పెడుతూ ప్రజలను మోసం చేస్తోంది. మాటలు చెప్పడం కాదు.. ఇచ్చిన హామీలను అమలు చేయాలి" అని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.ప్రజల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే వంటావార్పు వంటి వినూత్న నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆకాంక్షలు, ఆవేదనను తెలియజేయడమే లక్ష్యమన్నారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పోలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులకు అండగా నిలిచే సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మొండి వైఖరి వీడి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని, ప్రజలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.
ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ రాజీపడదని, ప్రజల హక్కులు, సంక్షేమం కోసం పోరాడుతూనే ఉంటామని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు.
ఈ వంటావార్పు కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ ప్రెసిడెంట్లు, మహిళా డివిజన్ ప్రెసిడెంట్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వికలాంగులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# సెలవు దినాల్లో పని పూర్తి చేసుకోండి..

**అక్రమ నిర్మాణాలకు అధికారుల పరోక్ష సహకారం**




బి.కె ఎన్ క్లేవ్ దగ్గర కూల్చిన మరుసటి రోజే తిరిగి పనులు ప్రారంభం



అభ్యుదయం. మియాపూర్. సెప్టెంబర్ 5. మియాపూర్ జిహెచ్ఎంసి పరిధిలో ఒకవైపు కూల్చివేతలు జరుగుతున్నా మరుసటి రోజు నుంచే తిరిగి నిర్మాణం చేపట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఎన్ని ఫిర్యాదులు చేసుకున్నా తగ్గేదేలే అంటూ మళ్ళీ నిర్మాణం చేపట్టడం వెనుక మతలబు ఏమిటనేది ఇట్టే అర్థమవుతుంది. మరోపక్క అక్రమ నిర్మాణదారులకు సెలవు దినాల్లో పని పూర్తి చేసుకోమని అధికారులే సలహాలు ఇస్తున్నట్టు పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు పూర్తిస్థాయి కూల్చివేతలు కాకుండా, నామమాత్రంగా కూల్చడం వెనుక సదరు నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానితో రాత్రికి రాత్రి అనుమతి లేని నిర్మాణాన్ని పూర్తిచేసి ఫిర్యాదుదారులకు సవాల్ విసురుతున్నారు. కూల్చివేతలకు ప్రత్యేకించి విలువైన సమయాన్ని కేటాయిస్తున్న అధికారులు పూర్తిస్థాయి కూల్చివేతలు చేపడితే మరలా తిరిగి నిర్మించడం దాదాపు సాధ్యం కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూల్చిన మరుసటిరోజే తిరిగి చేపడుతున్న నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## సిద్దిపేట పట్టణంలో శ్రీ కాత్యాయని సమేత సిద్దేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి.



సిద్దిపేట సెప్టెంబర్ 4సిద్దిపేట పట్టణంలో నిర్వహి ంచిన శ్రీ కాత్యాయని సమేత సిద్దేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి వంగ రాజేశ్వర్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా పాల్గొ ని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామివారి ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి, ఐక్యతను పెంపొందించడంలో ఎంతో కీలకమని వంగ రాజేశ్వర్ రెడ్డి గారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా, విజయవంతంగా నిర్వహించారు.

## ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహానికి స్థలం కేటాయించండి

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి ప్రజా సంఘాల వినతి**



హన్మకొండ సెప్టెంబర్ 04 జిల్లా కేంద్రంలో ప్రజాయుద్ధ నౌఖ గద్దరన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయించాలని కోరుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే ఎమ్మెల్యే ఫార్వర్డ్ చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో గద్దరన్న పాత్ర కీలకమైందని అలాంటి గద్దరన్న ఆశయ సాధనలో భాగంగా ఆయన విగ్రహాలను రాష్ట్రమంతా ఏర్పాటు చేసుకొని పీడిత ప్రజల విముక్తిలో భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ విగ్రహ స్థాపన కమిటి చైర్మన్ కోంఢ్ర నర్సింగరావు, బిసి జాక్ నాయకులు డాక్టర్ తిరునహరి శేషు, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, డి బి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, గజాల గోవర్ధన్, గద్దర్ సాంబయ్య, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మంధానకు ఇంకెప్పుడు కెప్టెన్సీ ఇస్తారు?:

## మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ డిమాండ్



మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై 124 పరుగులతో చెలరేగి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ రికార్డుల పర్వం వేళ భారత మహిళల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైస్ కెప్టెన్‌గా ఉన్న 30 ఏళ్ల స్మృతి మంధానను తక్షణమే టెస్టులు, వన్డేలు, టీ20లు అనే తేడా లేకుండా మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు పూర్తిస్థాయి కెప్టెన్‌గా ప్రకటించాలని అమితా శర్మ నేతృత్వంలోని జాతీయ ఎంపిక కమిటీని కోరారు. ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌ను జట్టు నుంచి తొలగించాలని తాను అనడం లేదని, కానీ ఆమె వయసు ఇప్పటికే 37 ఏళ్లకు చేరిందని డయానా గుర్తు చేశారు. హర్మన్ నుంచి కెప్టెన్సీ ఒత్తిడిని తొలగిస్తే ఆమె స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసి మిడిల్ ఆర్డర్‌లో పరుగులు సాధించగలదని అభిప్రాయపడ్డారు. "మనం ప్రతిసారీ ఓపెనర్లపైనే ఆధారపడలేం కదా. మిడిల్ ఆర్డర్‌లో హర్మన్ ఫామ్ జట్టు విజయాలకు ఎంతో ముఖ్యం. అందుకే స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, హర్మన్‌ను సీనియర్ ప్లేయర్‌గా కొనసాగించాలి" అని డయానా విశ్లేషించారు. ప్రస్తుతం స్మృతి మంధాన మంచి ఫామ్‌తో పాటు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని, నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి ఇది సరైన సమయమని డయానా పేర్కొన్నారు. స్మృతి సుదీర్ఘకాలం కెప్టెన్‌గా ఉండే అవకాశం ఉంటుందని, ఆమెకు డిప్యూటీగా జెమీమా రోడ్రిగ్స్ లేదా షఫాలీ వర్మలను వైస్ కెప్టెన్లుగా నియమించి భవిష్యత్ సారథులుగా తీర్చిదిద్దవచ్చని సూచించారు. కనీసం పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనైనా స్మృతికి కెప్టెన్సీ ఇచ్చి, టెస్టుల్లో హర్మన్‌ను కొనసాగించినా పర్లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కాగా, కెప్టెన్సీకి తాను సిద్ధంగానే ఉన్నానని స్మృతి ఇప్పటికే ప్రకటించడం గమనార్హం. మరోవైపు మిథాలీ రాజ్ ఆల్‌టైమ్ పరుగుల రికార్డును మంధాన అధిగమించడంపై మిథాలీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "ఒక సాధారణ క్రీడాకారిణిగా కెరీర్ ప్రారంభించి అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా స్మృతి ఎదిగిన తీరును చూశా. నా రికార్డును దాటి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్‌గా ఆమె నిలవడం సంతోషంగా ఉంది" అని మిథాలీ పోస్ట్ చేశారు.

# టీ20 క్రికెట్‌లో శ్రీ చరణి అరుదైన ఫీట్!




దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు తన జోరును కొనసాగిస్తోంది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత క్రీడాకారిణులు అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా యువ బౌలర్, తెలుగు తేజం శ్రీ చరణి తన అద్భుతమైన బౌలింగ్‌తో ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 193 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 194 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ముఖ్యంగా శ్రీ చరణి తన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో హాంకాంగ్ పతనాన్ని శాసించడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో కేవలం 3.2 ఓవర్లు బౌలింగ్ చేసిన శ్రీ చరణి, 16 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టింది. ఈ ప్రదర్శనతో ఆమె ఒకే క్యాలెండర్ ఇయర్‌లో భారత మహిళల జట్టు తరఫున అత్యధిక టీ20 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. 2026 క్యాలెండర్ ఇయర్‌లో చరణి ఇప్పటివరకు మొత్తం 31 వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో 2024లో 30 వికెట్లు తీసిన దీప్తి శర్మ రికార్డును ఆమె అధిగమించింది. ప్రస్తుతం ఈ జాబితాలో స్పిన్నర్ పూనమ్ యాదవ్ అగ్రస్థానంలో ఉంది. ఆమె 2018లో 35 వికెట్లు తీసి ఈ రికార్డును నెలకొల్పింది. చరణి ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, ఈ ఏడాది ముగిసేలోపు పూనమ్ యాదవ్ రికార్డును కూడా బద్దలు కొట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# మహిళల ఆసియాకప్‌లో భారత్ జోరు..

**హాంకాంగ్‌పై 137 పరుగుల తేడాతో విక్టరీ**



మహిళల ఆసియాకప్ 2026లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచులో హాంకాంగ్‌ను 137 పరుగుల తేడాతో చిత్తు చేసింది. భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డు సెంచరీతో టీమిండియా ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 193/5 రన్స్ చేసింది. అనంతరం హాంకాంగ్‌ను 56 పరుగులకు ఆలౌట్ చేసింది. దీంతో గ్రూప్-ఏలో అగ్రస్థానంలో నిలిచింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు మంధాన, షఫాలీ వర్మ (28) శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు వేగంగా పరుగులు జోడించి జట్టుకు బలమైన పునాది వేశారు. 8 ఓవర్లలో 74 పరుగులు జోడించారు. షఫాలీ అవుటైన తర్వాత కూడా మంధాన తన దాడిని కొనసాగించింది. ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో మంధాన స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. హాంకాంగ్ బౌలర్లను ఊచకోత కోస్తూ.. ఆమె కేవలం 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసింది. ఆరంభంలో కాస్త నిలకడగా ఆడినా, కుదురుకున్నాక హ్యాట్రిక్ సిక్సర్లు బాది స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. మంధాన రాణించినా మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. ప్రతికా రావల్ (10), రిచా ఘోష్ (11), హర్మన్ ప్రీత్ కౌర్ (10) విఫలమయ్యారు. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. 194 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హాంకాంగ్ జట్టుకు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. నందిని శర్మ ఆరంభంలోనే వికెట్ తీసి హాంకాంగ్ పతనాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, ప్రేమా రావత్, శ్రీ చరణిలు వరుస వికెట్లతో విరుచుకుపడటంతో హాంకాంగ్ కోలుకోలేకపోయింది. కేవలం 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు, చివరి ఆరు వికెట్లను కేవలం 18 బంతుల వ్యవధిలోనే కోల్పోయి 16.2 ఓవరలలో 56 పరుగులకే ఆలౌటైంది. భారత్ 137 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ అత్యుత్తమంగా రాణించి కేవలం 9 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. ఆమెకు తోడుగా నందిని శర్మ (2/6), ప్రేమా రావత్ (2/12), శ్రీ చరణి (2/16) తలో రెండు వికెట్లు తీసి హాంకాంగ్ పతనాన్ని శాసించారు. ఈ విజయంతో భారత జట్టు గ్రూప్-ఏలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ టోర్నీలో తమ తదుపరి మ్యాచులో భారత్.. సెప్టెంబర్ 5న పాకిస్థాన్‌తో తలపడనుంది.

# భారత్--జపాన్ మధ్య చారిత్రాత్మక పోరు..



భారత్-జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని క్రికెట్ మైదానంలో ప్రత్యేక రీతిలో జరుపుకోనున్నారు. భారత పురుషుల క్రికెట్ జట్టు జపాన్‌తో ఓ టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ఇటువంటి అంతర్జాతీయ మ్యాచ్‌లో ఈ రెండు జట్లు తలపడటం ఇదే మొదటిసారి కావడం ఈ మ్యాచ్‌ను చారిత్రాత్మకంగా నిలుపుతోంది. సుజుకి కప్ సెప్టెంబర్ 22, 2026న టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. జపాన్ క్రికెట్ అసోసియేషన్, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ప్రకటించాయి. భారత పురుషుల క్రికెట్ జట్టు ఈ నెలలో ఆసియా క్రీడల కోసం జపాన్‌కు వెళ్లనుంది, కానీ దానికి ముందు జరిగే ఈ మ్యాచ్ చాలా ప్రత్యేకమైనది. టీమిండియా జపాన్‌తో తొలిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడనుంది. ప్రపంచంలోని అత్యంత బలమైన క్రికెట్ జట్లలో ఒకటైన భారత్, జపాన్‌లో క్రికెట్‌కు కొత్త రూపునివ్వడంలో కీలక పాత్ర పోషించగలదు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ ఆ దేశంలో క్రికెట్‌ను అభివృద్ధి చేయడానికి, దాని ప్రాచుర్యాన్ని పెంచడానికి చాలా కాలంగా కృషి చేస్తోంది. అందువల్ల భారత జట్టుతో జరిగే మ్యాచ్ స్థానిక ఆటగాళ్లకు, క్రికెట్ అభిమానులకు ఓ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. భారత్, జపాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్ 'స్పోర్ట్ 75' చొరవలో భాగంగా జరిగే తొలి ఈవెంట్. క్రీడల ద్వారా ఇరు దేశాల మధ్య ప్రజల సంబంధాలను, సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. 2036 ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వాలన్న భారత ఆకాంక్షను కూడా పరిగణనలోకి తీసుకుంటూ, క్రీడా రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు భారత్, జపాన్ అగ్ర నాయకత్వం మధ్య కుదిరిన ఒప్పందంలో ఈ చొరవ ఒక భాగం. ఈ మ్యాచ్ భారత క్రికెట్‌కు ఓ ముఖ్యమైన సందర్భమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అభివర్ణించారు. జపాన్‌లో భారత జట్టు పాల్గొనడం కొత్త ప్రేక్షకులను చేరుకోవడానికి ఓ అవకాశమని ఆయన అన్నారు. భారత్, జపాన్‌ల మధ్య ఉన్న చిరకాల స్నేహ సంబంధాలను ప్రస్తావిస్తూ, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకల్లో క్రికెట్ పాల్గొనడం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుందని సైకియా అన్నారు. క్రికెట్‌ను దాని సాంప్రదాయ ప్రాంతాలకు మించి తీసుకువెళ్లాల్సిన బాధ్యతను బీసీసీఐ అర్థం చేసుకుందని.. అక్కడ ఈ క్రీడను బలోపేతం చేయడానికి జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) నవోకి మియాజీ.. భారత జట్టుకు జపాన్ ఆహ్వానం అందడాన్ని తమ సంస్థకు ఓ చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. ఆయన బీసీసీఐకి దాని మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, భారత క్రికెట్ అభిమానులు జపాన్‌కు తరలివస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మియాజీ స్థానిక జపనీయులకు కూడా ఈ మ్యాచ్‌ను వీక్షించి, తమ జట్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జపాన్ ఆటగాళ్లకు, భారత్ వంటి బలమైన జట్టుతో ఆడటం అంతర్జాతీయ స్థాయిలో తమను తాము పరీక్షించుకోవడానికి ఓ గొప్ప అవకాశం అవుతుంది.

మరోవైపు ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# అంతర్జాతీయ క్రికెట్ స్మృతి మంధాన రికార్డులు



భారత మహిళల క్రికెట్ స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన .. ఆసియాకప్ 2026లో సెంచరీతో అంతర్జాతీయ క్రికెట్‌లో రికార్డుల బూజు దులిపేసింది. ఎన్నో ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న రికార్డులను ఆమె తన ఒక్క ఇన్నింగ్స్‌తో బ్రేక్ చేసింది. దుబాయ్ వేదికగా హాంకాంగ్‌తో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 మ్యాచ్‌లో 124 పరుగులు చేసింది మంధాన. దీంతో భారత మాజీ సారథి మిథాలీ రాజ్ పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించింది. మిథాలీ అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించిన 10,868 పరుగుల మైలురాయిని దాటి, ప్రస్తుతం 10,880 పరుగులతో ప్రపంచంలోనే అత్యధిక పరుగులు చేసిన మహిళా క్రికెటర్‌గా అగ్రస్థానంలో నిలిచింది. కేవలం పరుగుల రికార్డే కాకుండా, అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక సెంచరీల రికార్డును కూడా స్మృతి మంధాన తన ఖాతాలో వేసుకుంది. హాంకాంగ్‌తో సెంచరీతో తన శతకాల సంఖ్యను మంధాన 18కి పెంచుకుంది. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లాన్నింగ్ (17 సెంచరీలు)ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచింది. మహిళల క్రికెట్‌లో పదివేల పరుగుల క్లబ్‌లో ఉన్న సూజీ బేట్స్, చార్లెట్ ఎడ్వర్డ్స్, స్టెఫానీ టైలర్ వంటి క్రికెటర్ల సరసన నిలిచిన మంధాన, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించి భారత్ గర్వపడేలా చేసింది. అంతేకాకుండా మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 4 వేర్వేరు క్యాలెండర్ సంవత్సరాలలో 500కు పైగా పరుగులు సాధించిన తొలి క్రికెటర్‌గా మంధాన నిలిచింది. 2026కు ముందు, ఆమె 2018, 2022, 2024 సంవత్సరాలలో ఈ మైలురాయిని అధిగమించింది.

## సంపాదకీయం

# ఏఐకి పెరిగిన ఆదరణ



నేటి యుగంలో ఎఐకి ఆదరణ బాగా పెరింగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఎఐపై ఆధారపడటం మేడలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024-2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ- సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0-3 సంవత్సరాల అనుభవం ఉన్న ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87-15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99-89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70-91.25 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10-15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ట వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68-5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను ఆటోమేట్ చేయడం లేదా ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణను అందించడం వంటివి కావచ్చునని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. వ్యాపార అవసరాలు మారుతున్న కొద్దీ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, నవీకరించుకునే వారి జీతాలు కూడా క్రమంగా పెరుగుతాయని నిపుణులు అర్థం చేసుకోవాలని సిన్హా అన్నారు. టెక్నాలజీ రంగం వెలుపల జీతాల పెరుగుదల, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకునే రంగాలలో కేంద్రీకృతమై ఉంది. గత రెండేళ్లలో, సెమీకండక్టర్ల రంగంలో 17 శాతం (మొదట 7 శాతం, ఆ తర్వాత 9 శాతం), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో 13 శాతం (మొదట 5 శాతం, ఆ తర్వాత 8 శాతం) జీతాలు పెరిగాయి.

ఈ రెండూ గత రెండేళ్లలో మరింత వేగవంతమయ్యాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌లో సీనియర్ జీతాలు రూ. 58.90 లక్షల వార్షిక ప్యాకేజీకి, సెమీకండక్టర్లలో రూ. 48.49 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరుకున్నాయి. గత ఏడాది ఆటోమోటివ్ రంగం 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. మెడికల్ ప్రాక్టీస్ రంగంలో 8 శాతం జీతాల పెరుగుదల, సీనియర్ జీతాలు రూ. 56.70 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరాయి. దీని తర్వాత మెడికల్ డివైసెస్ రంగంలో 6 శాతం, ఫార్మాస్యూటికల్స్ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఇదే కోణంలో ఎఇ కి ఆదరణ పెరిగితే ఆ రంగంలో రాణించే నిపుణులకు తిరుగుండదనేది నిపుణుల వాదన.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట

- మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కీలక ఉత్తర్వులు జారీ
- రేడియోగ్రాఫర్లు, నర్సులు, పీహెచ్‌సీ సిబ్బంది సమస్యలకు పరిష్కారం
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహకాలు

అమరావతి, సెప్టెంబర్ 4 (ఆర్ఎన్ఏ): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు సమీక్షలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట నిచ్చేలా కీలక ఉత్తర్వులు జారీ చేశారు.

### రేడియోగ్రాఫర్లకు ప్రత్యేక సెలవులు

రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. బోధనాస్పత్రుల్లో ఎక్స్‌రే, రేడియాలజీ విభాగాల్లో విధులు నిర్వహించే అర్హులైన సిబ్బందికి ప్రతి 11 నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల తప్పనిసరి ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించరాదని స్పష్టం చేసింది.

### సిబ్బంది సర్దుబాటుపై

పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత, విధుల సర్దుబాటుపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆదేశించింది. పగటి సమయంలో ఎంఎన్ఓలు, ఎఫ్ఎన్ఓల సేవలను, రాత్రి సమయంలో అవసరానికి అనుగుణంగా ఎస్ఏడబ్ల్యూల సేవలను వినియోగించాలని సూచించింది. ముఖ్యంగా రాత్రి విధులు నిర్వహించే సిబ్బందికి సహాయకంగా వీరి సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొంది.

### నర్సులపై పని భారం తగ్గిస్తూ

నర్సులపై ఉన్న 12 గంటల నిరంతర విధి భారం తగ్గించేలా కూడా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులు పనిచేస్తున్న సందర్భంలో ఒకరు సెలవులో ఉన్నా, మిగిలిన సిబ్బందితో రొటేషన్ పద్ధతిలో విధులు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. పగటి సమయంలో ఒక నర్సుపై 12 గంటల నిరంతర విధి భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ఒఔఓ సేవలను సమర్థంగా వినియోగించుకుని విధులు సర్దుబాటు చేయాలని సూచించారు.

### పీహెచ్‌సీ ల్లో విద్యార్థులకు శిక్షణ

డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులకు కూడా పీహెచ్‌సీల్లో క్లినికల్ శిక్షణకు అవకాశం కల్పించారు.



6 లేదా 12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో శిక్షణ పొందేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు.

### ఎన్టీఆర్‌వీఎస్‌టీ కింద ప్రోత్సాహకాలు

శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా అందే ప్రోత్సాహకాల్లో డాక్టర్లతో పాటు వాటిలో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ వారి క్యాడర్‌కు అనుగుణంగా నిర్ణయించిన వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, ఝు టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సంబంధిత సిబ్బందిని కూడా అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు, పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# అమరావతి ఛాంపియన్‌షిప్ లో ఏలూరు జిల్లాకు రెండవ స్థానం

**రూ 4 లక్షలు ప్రైజ్ మనీ, 38 మంది క్రీడాకారులు 38 మెడల్స్ - జిల్లాకు ఎంతో గర్వకారణం.**

ఏలూరు, సెప్టెంబర్ 4 :అమరావతి ఛాంపియన్‌షిప్ లో విజయం సాధించిన కోచ్ లు, క్రీడాకారులు ఆత్మీయ విందులో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పాల్గొని వారిలో మరింత క్రీడా స్ఫూర్తినింపారు. జిల్లా కలెక్టరు క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో 38 మంది క్రీడాకారులకు 38 మెడల్స్, రూ 4 లక్షలు ప్రైజ్ మనీని, ట్రోఫీలను అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ లు, క్రీడాకారులు తమ అనుభవాలను పంచుకున్నారు. వారితో జిల్లా కలెక్టరు సహబంతి భోజనం చేశారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్నలు పాల్గొన్నారు. ముందుగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఏలూరు జిల్లాను సమష్టిగా రెండవ స్థానంలో నిలిపిన క్రీడాకారులు, వారి వెనుక ఉండి నడిపించిన కోచ్‌లు ఎంతో అభినందనీయులని జిల్లా కలెక్టరు కొనియాడారు. క్రీడాస్ఫూర్తికి ఏలూరు జిల్లాను నిదర్శనంగా నిలపడం నాకు ఎంతో సంతోషాన్ని,



సంతృప్తి కలిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలు నుంచి తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, జిల్లా క్రీడాకారులు అంకితభావంతో రాణించి ద్వితీయ స్థానం కైవసం చేసుకోవడం జిల్లాకే గర్వకారణం అన్నారు. క్రీడాకారులు విజయాలు వెనుక కోచ్‌ల కఠోర శ్రమ, సరైన శిక్షణ అతి ముఖ్యం అని, వారి మార్గదర్శకత్వం వల్లే ఈ ఘనత సాధ్యమైందని అన్నారు. క్రీడలకు జిల్లా యంత్రాంగం ప్రోత్సాహం ఇచ్చుటకు అన్నివేళలు సిద్ధంగా ఉందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం మద్దతుగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా ప్రతిభ చాటేలా మరింత సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా కలెక్టరు స్పష్టం చేశారు.యువత చదువుతో పాటు ఏదో ఒక




క్రీడలో రాణించడం ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం సాధించవచ్చని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లో ఏలూరు జిల్లాను ప్రథమ స్థానమే లక్ష్యంగా సాధన చెయ్యాలని క్రీడాకారులకు జిల్లా కలెక్టరు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి సయ్యద్ అబ్దుల్ అజీజ్, సెట్ వెల్ సిఇవో కె.యస్. ప్రభాకర రావు, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ,ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బడేటి వెంట్రామయ్య, పిఇటి అసోసియేషన్ సెక్రటరీ, బాస్కెట్ బాల్ టీమ్ కోచ్ వాకా నాగరాజు, బాస్కెట్ బాల్ ఉమెన్ కోచ్ కె.మురళీకృష్ణ, తదితర కోచ్ లు, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ సిబ్బంది, క్రీడాకారులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ

ఏలూరు, సెప్టెంబర్, : సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వసతిగృహాల వార్డెన్లను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక అమీనాపేటలోని షెడ్యూల్డ్ కులాలు, వెనుకబడిన తరగతులు, సమీకృత వసతి గృహాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజన మెనూలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాలని, భోజన మెనూ నిర్దేశించిన విధంగా ఉండాలన్నారు. టాయిలెట్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దోమలు పెరగకుండా చూడాలన్నారు. వసతి గృహాలకు దోమల నెట్లు అందించడం జరిగిందని, విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా చూడాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు విద్యా ప్రమాణాల స్థాయిని పెంచేలా బోధనా చేయాలనీ, గత సంవత్సరం కన్నా ప్రస్తుత సంవత్సరం ఉతీర్ణతా శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాద కద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలు, రహదారి భద్రత నియమాలు, బాలికల భద్రత, తదితర అంశాలను కలెక్టర్ తెలియజేసారు. అత్యవసర సమయంలో 1972 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి రక్షణ పొందే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కలిగించారు. కష్టపడి విద్య నభ్యసించి ఉన్నత స్థానం సాధించేలా కృషిచేయాలని



విద్యార్థినులకు కలెక్టర్ చెప్పారు. అనంతరం కిచెన్ లో పరిశుభ్రతను,వన్డే ఆహార పదార్థాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జెడి వై.విశ్వమోహన్ రెడ్డి, ఏఎస్ డబ్ల్యూవో ఆర్.వి.శ్రీనివాసు, హాస్టల్ వెల్ఫేరు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్..

### సెన్సెక్స్ 362 పాయింట్లు లాభం



భారత స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభాల్లో ముగిసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 362 పాయింట్లు పెరగగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 24 పాయింట్లు పెరిగింది. దీంతో నాలుగు రోజులుగా సాగిన నష్టాలకు శుక్రవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 531.88 పాయింట్ల పెరుగుదలతో 76,684.74 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ 78.25 పాయింట్ల పెరుగుదలతో 23,951.70 వద్ద ప్రారంభమైంది.

చివరకు సెన్సెక్స్ 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద, నిఫ్టీ 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 విలువ 0.25 శాతం నష్టపోగా, నిఫ్టీ మైక్రోక్యాప్ 250 కూడా 0.67 శాతం నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ ఇండెక్స్ 0.90 శాతం పడిపోగా, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 1.07 శాతం పెరిగింది. 30 షేర్ బీఎస్ఈ ఇండెక్స్‌లో రిలయన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ట్రెంట్ లాభాల్లో ముగిశాయి. మరోవైపు ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, మారుతి నష్టాల్లో ముగిశాయి.అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 95.52 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 4,472 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.49 వద్ద ఉంది. మరోవైపు ఆసియన్ మార్కెట్లు కూడా ఈ రోజు లాభాల్లోనే ముగిశాయి. హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2 శాతం, దక్షిణ కొరియాకు చెందిన కోస్పి అడ్వాన్సుడ్ 1.3 శాతం, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్ 1.11 శాతం, షాంగై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్ 0.35 శాతం లాభపడ్డాయి. అమెరికన్ మార్కెట్లు కూడా 1 శాతానికి పైగా లాభాల్లో ముగిశాయి.

## ఫోక్స్‌వ్యాగన్‌లో భారీగా ఉద్యోగాల కోత..

### లక్ష మందిని తీసేస్తామని ప్రకటన




జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్ భారీగా ఉద్యోగ కోతలకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తొలగించేందుకు నిర్ణయించినట్లుగా ప్రకటించింది. ఈ దశాబ్దం చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి కానుందని వెల్లడించారు. ఈ మేరకు కంపెనీ యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 50 వేల ఉద్యోగాల కోతకు అంగీకరించగా.. తాజాగా మరో 50 వేల పోస్టులను తొలగించేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పింది. కాగా, కంపెనీ చరిత్రలోనే కాకుండా ప్రపంచ ఆటోమొబైల్ రంగంలోనే ఇది అతిపెద్ద పునర్వ్యవస్థీకరణగా నిలవనుంది.కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగినట్లుగా ఉద్యోగుల సంఖ్యను క్రమబద్ధీకరించడం తప్పనిసరని ఫోక్స్‌వ్యాగన్ కంపెనీ ఈ సందర్భంగా పేర్కొంది. అమెరికా సుంకాలు, ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్‌లో హెచ్చుతగ్గులు, ముఖ్యంగా చైనాకు చెందిన సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ కారణంగా యూరప్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే లేఆఫ్స్‌కు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ప్రస్తుతం ఫోక్స్‌వ్యాగన్ కంపెనీలో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోని దాదాపు 43 శాతం మంది విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఆ కంపెనీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా లక్ష ఉద్యోగాలను తగ్గిస్తామని ప్రకటించింది. అంటే మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతానికి సమానం అన్నమాట. ఈ ఉద్యోగాల కోతను కార్మిక సంఘాలు వ్యతిరేకించినట్లుగా గతంలో వార్తలు వచ్చాయి. అయితే తాజా ప్రకటనలో మాత్రం కార్మిక సంఘాలు కూడా అంగీకరించినట్లు తెలపడం గమనార్హం.

కాగా, హ్యానోవర్, ఎమ్డెన్, జ్వికావ్, నెకార్సుల్మ్‌లోని నాలుగు జర్మన్ ప్లాంట్ల దీర్ఘకాలిక భవిష్యత్తుపై స్పష్టత లేదని కంపెనీ తెలిపింది. అయితే ఈ ప్లాంట్లకు ప్రత్యామ్నాయ వినియోగ మార్గాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. పూర్తి స్థాయి ప్లాంట్లను జర్మనీలో మూసివేయడం వోక్స్‌వ్యాగన్‌కు ఇదే తొలిసారి కానుందని కార్మిక వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# కూరగాయలను తినలేకపోతున్నారా..
# ఈ మార్గాలను ప్రయత్నించండి..

కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వింటూ ఉంటారు. అయితే కూరగాయలను నేరుగా తినడం ఇష్టం లేని వారు చాలామందే ఉంటారు. అలాంటి వారు తమ రోజువారీ ఆహారంలో కూరగాయలను సులభంగా చేర్చుకునేందుకు కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కూరగాయలను బలవంతంగా తినకుండా, నచ్చిన రుచులు, రూపాల్లో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా వాటిని ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది. రోజుకు తొమ్మిది కప్పుల కూరగాయలు తీసుకోవడం ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి ఉపయోగపడుతుందని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. కూరగాయలను నేరుగా తినడం కష్టంగా అనిపిస్తే వాటితో జ్యూస్ తయారు చేసుకుని తీసుకోవచ్చు. ఉదాహరణకు టమాటా, క్యారెట్, బీట్‌రూట్‌తో తయారు చేసే జ్యూస్ రుచిగా ఉండటంతో పాటు కూరగాయలను ఆహారంలో చేర్చుకునే సులభమైన మార్గంగా ఉపయోగ పడుతుంది. పుదీనా, కొత్తిమీరతో తయారు చేసే జ్యూస్‌ను కూడా తీసుకోవచ్చు. రోజులో రెండు రకాల కూరగాయల జ్యూస్‌లు తీసుకోవడం ద్వారా గణనీయమైన మొత్తంలో కూరగాయలను ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే జ్యూస్ రూపంలో తీసుకోవడం వల్ల కూరగాయలు తినడం పూర్తిగా భర్తీ చేయకూడదని గుర్తుంచుకోవాలి. కూరగాయలను నేరుగా తినడం ఇష్టం లేని వారిలో చాలామందికి సలాడ్లు మాత్రం నచ్చుతాయి. అలాంటి వారు బొప్పాయి సలాడ్, ఆకుకూరల సలాడ్, దానిమ్మ-కీరదోస సలాడ్ వంటి వాటిని ప్రయత్నించవచ్చు. ఇలా సలాడ్ల రూపంలో కూడా రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఇతర పోషక పదార్థాలను సులభంగా చేర్చుకోవచ్చు. సలాడ్లలో కూరగాయలను సహజ రూపంలో తీసుకోవడం వల్ల వాటిలోని పీచు పదార్థాన్ని పొందవచ్చు. అలాగే కూరగాయలలో ఉండే సహజమైన క్రంచ్, తాజాదనం సలాడ్లను మరింత ఆకర్షణీయంగా మారుస్తాయి. కూరగాయలను వండుకుని తినడం ఇష్టం లేని వారికి సలాడ్లు మరో మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. సలాడ్‌గా కూడా తీసుకోవచ్చు..



రోజువారీ ఆహారంలో చివరగా సాధారణ కూరగా లేదా భాజీగా కూరగాయలను తీసుకోవచ్చు. అంటే జ్యూస్, సలాడ్, వండిన కూర అనే మూడు రకాలుగా కూరగాయలను రోజంతా విభజించుకుని తీసుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా ఒకేసారి పెద్ద మొత్తంలో కూరగాయలు తినాల్సిన అవసరం లేకుండా రోజువారీ ఆహారంలో వాటిని సులభంగా చేర్చుకోవచ్చు. కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలనే లక్ష్యం మొదట్లో భారంగా అనిపిస్తుందని, అయితే వాటిని వివిధ రూపాల్లో రోజంతా విభజించుకుంటే సులభంగా అలవాటు చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం లేదా పగటిపూట తాజా కూరగాయల జ్యూస్, మరో సమయంలో రంగురంగుల సలాడ్, భోజనంలో వండిన కూరను చేర్చుకోవచ్చు. అయితే కూరగాయల జ్యూస్‌లు మాత్రమే తీసుకుంటూ, తాజా కూరగాయలను పూర్తిగా మానేయడం సరైన పద్ధతి కాదు. సలాడ్ల ద్వారా సహజమైన పీచు పదార్థాన్ని పొందవచ్చు. వండిన కూరగాయలు మెత్తగా మారడంతో రోజువారీ భోజనంలో వాటిని సులభంగా చేర్చుకోవచ్చు. అందువల్ల జ్యూస్, సలాడ్, వండిన కూర.. ఇలా వివిధ రూపాల్లో కూరగాయలను తీసుకోవడం మంచిది. కూరగాయలను తినడం ఇష్టం లేని వారు తమకు నచ్చిన రుచులు, పదార్థాలు, వంట విధానాలను గుర్తించి వాటికి అనుగుణంగా కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు

. ఒకేసారి పెద్ద మొత్తంలో కూరగాయలు తినడం కంటే రోజంతా వివిధ రకాలుగా తీసుకోవడం సులభమైన మార్గంగా ఉంటుంది.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..

ఉప్పు.. మన రోజువారీ వంటల్లో తప్పనిసరిగా ఉపయోగించే పదార్థం. అయితే ఆరోగ్యంపై చర్చ వచ్చినప్పుడు ఉప్పును చాలామంది తప్పుగా చూస్తుంటారు. ముఖ్యంగా అధిక ఉప్పు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయనే భయంతో కొందరు దాన్ని పూర్తిగా తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. కానీ మన శరీరానికి సోడియం అనే ఖనిజం కూడా అవసరమే. శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటం, నరాల పనితీరుకు సహకరించడం, కండరాలు సరిగ్గా పనిచేయడం వంటి ముఖ్యమైన ప్రక్రియల్లో సోడియం కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరానికి తగినంత సోడియం అందుతుంది. అయితే ఎక్కువగా చెమట పట్టడం, తీవ్రమైన వ్యాయామం చేయడం, వేడి వాతావరణంలో ఎక్కువసేపు ఉండటం లేదా శరీరం నుంచి ద్రవాలు ఎక్కువగా కోల్పోవడం వంటి పరిస్థితుల్లో ఎలక్ట్రోలైట్ స్థాయిల్లో మార్పులు వస్తాయి. అలాంటి సమయంలో కేవలం నీరు తాగడం మాత్రమే సరిపోదని, శరీరంలోని ద్రవాలు, ఎలక్ట్రోలైట్లు, సోడియం మధ్య సమతుల్యత కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో సోడియం తక్కువగా ఉన్నప్పుడు కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాలు కనిపించాయంటే తప్పనిసరిగా సోడియం లోపమేనని అర్థం కాదు. అయినప్పటికీ వాటిని నిర్లక్ష్యం చేయకుండా పరిస్థితిని గమనించడం అవసరం. ఎంత నీరు తాగినా దాహం తీరకపోవడం అలాంటి సంకేతాల్లో ఒకటిగా చెప్పవచ్చు. నీరు తాగిన వెంటనే మూత్రం రావడం, తరచూ దాహం వేయడం వంటి పరిస్థితులు ఉంటే శరీరంలో ద్రవాలు మాత్రమే కాకుండా ఎలక్ట్రోలైట్లు, సోడియం సమతుల్యతను కూడా పరిశీలించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. శరీరానికి తగిన హైడ్రేషన్ అంటే కేవలం నీరు తీసుకోవడం మాత్రమే కాదని, నీరు, ఎలక్ట్రోలైట్లు, సోడియం మధ్య సమతుల్యత కూడా అవసరమని చెబుతున్నారు.



అదేవిధంగా అదుపు చేయలేని తీపి పదార్థాల కోరిక కూడా కొన్ని సందర్భాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా ఎక్కువగా చెమట పట్టిన తర్వాత బిస్కెట్లు, స్వీట్లు వంటి వాటిని తినాలనే కోరిక పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు

.అందుకే తీపి పదార్థాలపై కోరిక పెరిగినప్పుడు దాన్ని కేవలం స్వీట్ టూత్ గా భావించే ముందు ఆహారంలో తగినంత సోడియం, ఇతర ఎలక్ట్రోలైట్లు అందుతున్నాయా అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు.

# షుగర్ ఉన్నవారి ఆరోగ్యాన్ని కాపాడే పసుపు

### . పరిశోధనల్లో తేలిన నిజం..

మధుమేహం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడమే కాకుండా రక్తనాళాలపై కూడా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు రక్తంలో చక్కెర అధికంగా ఉంటే రక్తనాళాల గోడల్లో మార్పులు రావడంతో పాటు గుండె సంబంధిత సమస్యల ముప్పు పెరుగుతుంది. అయితే వంటింట్లో సాధారణంగా ఉపయోగించే పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థం మధుమేహంతో దెబ్బతినే రక్తనాళాలకు కొంత రక్షణ కల్పిస్తుందని ఓ కొత్త అధ్యయనం సూచిస్తోంది. టైప్-1 మధుమేహం ఉన్న ఎలుకలపై నిర్వహించిన ఈ పరిశోధనలో కర్కుమిన్‌తో చికిత్స చేసిన తర్వాత రక్తనాళాల ఆరోగ్యంలో మెరుగుదల కనిపించింది. రక్తనాళాల్లో వాపు తగ్గడంతోపాటు కాల్షియం నియంత్రణ మెరుగుపడినట్లు పరిశోధకులు గుర్తించారు. అలాగే శరీరంలోని అతిపెద్ద బృహద్ధమని (అరోటా) నిర్మాణం, పనితీరులోనూ సానుకూల మార్పులు కనిపించాయి.

**ఎలుకలపై ప్రయోగం..**

టైప్-1 మధుమేహం రక్తనాళాలను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవడంపై పరిశోధన ప్రధానంగా దృష్టి సారించింది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువకాలం పాటు అధికంగా ఉండటం వల్ల రక్తనాళాల గోడల్లో మార్పులు వస్తాయి. అలాగే రక్తనాళాలు కుచించుకోవడం, తిరిగి విస్తరించడం



వంటి ప్రక్రియలు కూడా ప్రభావితమవుతాయి. కాలక్రమేణా ఈ మార్పులు గుండె, రక్తనాళాలకు సంబంధించిన వ్యాధుల ముప్పును పెంచే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావాలను కర్కుమిన్ తగ్గించగలదా అనే విషయాన్ని పరిశీలించేందుకు టైప్-1 మధుమేహం ఉన్న మగ ఎలుకలను పరిశోధకులు ఉపయోగించారు. వాటిలో ఒక వర్గానికి 28 రోజుల పాటు కర్కుమిన్ ఇచ్చారు. మరో మధుమేహం ఉన్న ఎలుకల వర్గానికి కర్కుమిన్ ఇవ్వలేదు. అనంతరం వాటి రక్తనాళాలను, ముఖ్యంగా బృహద్ధమనిని పరిశీలించారు.

**మెరుగుపడిన రక్తనాళాల పనితీరు..**

28 రోజుల చికిత్స అనంతరం కర్కుమిన్ తీసుకున్న ఎలుకల్లో రక్తనాళాల పనితీరు మెరుగుపడినట్లు గుర్తించారు. వాపు, కాల్షియం కార్యకలాపాలు, అలాగే హీట్ షాక్ ప్రోటీన్ 70 అనే ప్రోటీన్‌లోనూ మార్పులను పరిశోధకులు గమనించారు. కణాలను ఒత్తిడి నుంచి రక్షించడంలో, రక్తనాళాల పనితీరును నియంత్రించడంలో ఈ ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. పసుపులో ఉండే కర్కుమిన్‌కు యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నట్లు ఇప్పటికే తెలుసు. అయితే ఈ అధ్యయనం ప్రకారం మధుమేహం సందర్భంలో దాని ప్రభావం కేవలం వాపును తగ్గించడం, ఆక్సిడేటివ్ ఒత్తిడిని నియంత్రించడం వరకే పరిమితం కాదని తెలుస్తోంది. దీర్ఘకాలిక మధుమేహం శరీరంలో వాపు స్థాయిలను పెంచుతుంది. ఇది రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ పరిశోధనలో కర్కుమిన్ తీసుకున్న ఎలుకల్లో వాపుతో సంబంధం ఉన్న కొన్ని సూచికలు తగ్గినట్లు గుర్తించారు. రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో వాపు తగ్గడం కూడా ఒక కారణం అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు.

**కాల్షియం అయాన్లు కీలకం..**

రక్తనాళాల కండరాలు కుచించుకోవడానికి, తిరిగి సడలడానికి కాల్షియం అయాన్లు కీలకం. మధుమేహం కారణంగా ఈ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుంది. దీంతో రక్తనాళాలు అవసరానికి మించి స్పందించడం లేదా ఎక్కువగా కుచించుకోవడం జరుగుతుంది. అయితే కర్కుమిన్ ఇచ్చిన ఎలుకల్లో బృహద్ధమనిలో కాల్షియం కదలికలు కొంత సాధారణ స్థితికి వచ్చినట్లు పరిశోధకులు గుర్తించారు. ఇది రక్తనాళాల పనితీరు మెరుగుపడటంతో సంబంధం కలిగి ఉన్నట్లు తేలింది. అదే విధంగా కర్కుమిన్ హెచ్ఎస్‌పీ70 సమతుల్యతను కూడా ప్రభావితం చేసినట్లు అధ్యయనం తెలిపింది.



# తొలిసారి ‘హారర్ కామెడీ’ బాటలో మాస్ మహారాజా

బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన ‘ఇరుముడి’ చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. ‘సరిపోదా శనివారం’ వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది.

# నోరుపారేసుకున్న నటి కస్తూరి

కొందరు సెలబ్రిటీలు ఏం మాట్లాడినా, ఏం చేసినా ఖచ్చితంగా వివాదాస్పదం అవుతుంది. ఈ కోవలోకే వస్తారు తమిళ నటి కస్తూరి శంకర్. మనసులో ఎలాంటి భావం ఉన్నా ఉన్నది ఉన్నట్లు ముఖం మీద చెప్పడంతో ఈమె ముందు వరుసలో ఉంటారు. తొలి నుంచి డేరింగ్ అండ్ డాషింగ్ బిహేవియర్‌తో ఏరికోరి వివాదాల్లో చిక్కుకున్నారు కస్తూరి. సినీరంగంలో మహిళలపై వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్‌తో పాటు తమిళనాడులో ఉంటున్న తెలుగువారిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చారు. ఆ తర్వాత కాస్త సైలెంట్ అయినప్పటికీ తిరిగి యాక్టీవ్ అయ్యారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం హీరో పాత్రలను చూపిస్తున్న విధానంపై కస్తూరి శంకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1991లో ఆతా ఉన్ కోయిలే సినిమా ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన ఆమె.. మూడున్నర దశాబ్దాల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందకు పైగా చిత్రాల్లో నటించారు.



# కొణిదెల వారి ఇంట్లో చిన్ని కృష్ణుడు సందడి

మెగా హీరో రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ ముగ్గురు పిల్లలతో కలిసి కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. తమ కుమారుడు, కూతుర్లను శ్రీకృష్ణుడు, రాధారాణి వేషధారణలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను మెగా కోడలు ఉపాసన సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. “కల నెరవేరింది. నిజంగా ధన్యమైనది. ఓం నమో భగవతే వాసుదేవాయ. అందరికీ జన్మాష్టమి శుభాకాంక్షలు” అని ఉపాసన ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. ఇందులో చెర్రీ - ఉపాసన దంపతులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి, తమ పూజా మందిరంలో విగ్రహాల ముందు కూర్చుని పూజ చేస్తూ కనిపిస్తున్నారు. తమ కవల పిల్లలను ఒళ్లో కూర్చొని పెట్టుకుని పూజా



కార్యక్రమంలో పాల్గొంటుండగా, వారి పెద్ద కువ ార్తె క్లిన్ కార తన తల్లిదండ్రులు మధ్య కూర్చుని ఉంది

ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ‘కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగుపెట్టాడు’ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఉపాసన షేర్ చేసిన ఫొటోలో తమ ముగ్గురు చిన్నారుల ఫేస్ కనిపించకుండా జాగ్రత్త పడ్డారు. అయినప్పటికీ ‘కొణిదెల వారి ఇంట్లోకి చిన్ని కృష్ణుడు అడుగుపెట్టాడు’ అంటూ మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెగా కపుల్ కి శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు చెబుతూ కామెంట్లు చేస్తున్నారు. మెగా ఫ్యామిలీ కృష్ణాష్టమి స్పెషల్ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ‘ఆర్‌సీ 17’కి అంతా సిద్ధం?

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన ‘పెద్ది’ చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లతో అఖండ విజయం సాధించిన జోష్‌లో ఉన్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, తన తదుపరి ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. ‘రంగస్థలం’ వంటి చారిత్రాత్మక ఇండస్ట్రీ హిట్ తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రానున్న ‘=జ17’ ముహూర్తపు వేడుకలను రాబోయే దసరా పండుగ సందర్భంగా నిర్వహించి, నవంబర్ నుంచి మైత్రీ మూవీ మేకర్స్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మిక మందానా, రుక్మిణి వసంత్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ‘ఉప్పెన’ ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకున్న రూటెడ్ స్పోర్ట్స్ డ్రామా ‘పెద్ది’ ఇటీవలే బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని అందుకుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో మెరిసిన ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎ.ఆర్. రెహమాన్ అందించిన స్వరాలు ప్రాణంగా నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా రూ. 400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను కొల్లగొట్టి ‘పెద్ది’ చరణ్ కెరీర్లోనే




సోలో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ భారీ విజయం అందించిన జోష్‌తో ఉన్న రామ్ చరణ్ తన నెక్స్ట్ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో సుకుమార్–రామ్‌చరణ్ కాంబినేషన్లో వచ్చిన ‘రంగస్థలం’ బాక్సాఫీస్ వద్ద ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో తెలిసిందే. చిట్టిబాబు పాత్రలో రామ్ చరణ్ ఒదిగిపోయిన తీరు, సుకుమార్ అద్భుత దర్శకత్వ ప్రతిభ వెండితెరపై ఒక క్లాసిక్‌గా నిలిచాయి. ఆ ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ ‘=జ17’పై మొదటి నుంచే భారీ హైప్ నెలకొంది. అయితే ‘పెద్ది’ షూటింగ్ సమయంలో చరణ్ చేతికి గాయం కావడం, శస్త్రచికిత్స తర్వాత వైద్యుల సలహాతో విశ్రాంతి తీసుకోవడంతో ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుందా అని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ఎదురుచూపులకు తెరపడనుంది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇప్పటికే ప్రీ–ప్రొడక్షన్ వ్యవహారాలన్నీ ముగింపు దశకు చేరుకున్నాయి. రాబోయే దసరా పండుగ శుభదినాన ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అనంతరం నవంబర్ మొదటి వారం నుంచే రెగ్యులర్ షూటింగ్ నిరవధికంగా జరపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# ఓటీటీలోకి కాంట్రవర్సీ మూవీ




ఇటీవల కొన్ని సినిమాలు విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకుంటున్నాయి. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలు లేదా సంభాషణల విషయంలో కొన్ని సంస్థలు ఈ చిత్రాలను వ్యతిరేకించడంతో అవి థియేటర్లలో విడుదల కావడం లేదు. అలాగే బోల్డ్ కంటెంట్ కారణంగా కూడా కొన్ని సినిమాలు విడుదల కాలేదు. అయితే, ఈ చిత్రాలు ప్రస్తుతం ఓటీటీలో అందుబాటులో ఉన్నాయి. ప్రేక్షకులు కూడా ఈ చిత్రాలను ఓటీటీలో చూసేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. అలా థియేటర్లలో నిషేధానికి గురై ఓటీటీలో సంచలనం సృష్టంచిన సినిమా ‘అన్‌ఫ్రీడమ్’. బాలీవుడ్ దర్శకుడు రాజ్ అమిత్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఉగ్రవాదం, మత ఛాందసవాదం, స్వలింగ సంపర్కం, ప్రేమ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి సున్నితమైన అంశాలు ఉన్నాయి దీంతో 2015లో ఈ చిత్రానికి భారతదేశంలఓ థియేటర్లలో విడుదలకు ఆమోదం లభించలేదు. ‘అన్‌ఫ్రీడమ్’ సినిమా కథ వివిధ పాత్రల జీవితాల చుట్టూ తిరుగుతుంది. ఒకవైపు ఇది ఉగ్రవాదం, మత ఛాందసవాదం వంటి సమస్యలను ప్రస్తావిస్తూనే, మరోవైపు తమ సొంత గుర్తింపు, ప్రేమ, తాము కోరుకున్నట్లుగా జీవించే హక్కు కోసం పోరాడుతున్న వ్యక్తుల కథను ఆవిష్కరిస్తుంది.‘